
సాక్షి చిత్తూరు

ఆదివారం । 3 । నవంబర్ । 2024



ఆగని ఏనుగుల దాడి

చిత్తూరు జిల్లాలోని పులిచర్ల, బంగారుపాళెం మండలాల్లో పంటలపై ఏనుగుల దాడులు ఆగడం లేదు.

- 8లో



అండగా ఉంటాం

42 ఏళ్ల పాటు ఉద్యోగం చేసి, విరమణ పొందినప్పటికీ పోలీసుశాఖ అండగా ఉంటుందని ఎస్పీ మణికంఠ తెలిపారు.

- 8లో



దొంగల ముఠా అరెస్టు

జాతీయ రహదారిలో దారి దోపిడీకి పాల్పడుతున్న ముఠాను శనివారం కాణిపాకం పోలీసులు అరెస్టు చేశారు.

- 8లో

న్యూస్‌రీల్

నెమ్మదించిన సర్వర్



చిత్తూరు అర్బన్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో వేచి ఉన్న వినియోగదారులు

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్ర రిజిస్ట్రేషన్‌శాఖ సర్వర్ నెమ్మదించడంతో జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సేవలు స్తంభించింది. శుక్రవారం నుంచి సమస్య ఏర్పడడంతో సిబ్బంది వాటి సాఫ్ట్‌వేర్ బాగు చేసే పనిలో పడ్డారు. శనివారం నెమ్మదిగా రావడంతో వినియోగదారులు విసిగిపోయారు. ఈసీ, ఈ–కేవైసీల కోసం వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో రెండు రోజులుగా అమ్మకం, కొనుగోలుదారులు కార్యాలయాల వద్ద పడిగాపులు కాశారు. సోమవారం నాటికి సమస్య పరిష్కారమవుతుందని అధికారులు చెబుతున్నారు.

క్షయవ్యాధిని కట్టడి చేయాలి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): క్షయవ్యాధిని కట్టడిలోకి తెచ్చేలా వైద్యసేవలు అందించాలని జిల్లా క్షయ నివారణ అధికారి వెంకటప్రసాద్ అన్నారు. చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శనివారం ల్యాబ్ టెక్నీషియన్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓపీకి వచ్చేవారికి టీబీ పరీక్షలు చేయాలన్నారు. ఆశ కార్యకర్తలు ప్రతివారం అనుమానిత కేసులకు గళ్ల పరీక్షలు చేయాలన్నారు. పాజిటివ్ వ్యక్తులను సూపర్‌వైజర్లు నిత్యం పర్యవేక్షిస్తూ వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలన్నారు. 2025కు టీబీ లేని సమాజ స్థాపనే ధ్యేయంగా పనిచేయాలని చెప్పారు. సమావేశంలో అధికారులు రామచంద్రారెడ్డి, శ్రీవాణి, రామచంద్ర, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయపార్టీలకు ఓటరు జాబితా



రాజకీయపార్టీలకు పంపేందుకు కలెక్టరేట్‌లో సిద్ధంగా ముసాయిదా ఓటరు జాబితా ప్రతులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు ఓటరు జాబితాను పంపుతున్నారు. ఇటీవల విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాను కలెక్టరేట్ అధికారులు ముద్రించారు. అన్ని నియోజకవర్గాలకు సంబంధించి ఆయా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు జాబితాను పంపే కసరత్తు చేస్తున్నారు. అలాగే ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో ముసాయిదా ఓటరు జాబితాను అందుబాటులో పెట్టారు.

ఘోరం.. పాపం



బోరున విలపిస్తున్న చిన్నారి తల్లి

అభం శుభం తెలియని చిన్నారి నిండు ప్రాణాలు కర్కశత్వానికి బలైపోయాయి. కల్మషం లేని చిరునవ్వులు చీకటిలో కలిసిపోయాయి. ముద్దులొలికే మాటలు మూగబోయాయి. మానవమృగం వికృత చేష్టలను అడ్డుకోలేక చిట్టి చేతులు నలిగిపోయాయి. కామాంధుడి కబంధ హస్తాల నుంచి కాపాడేవారి కోసం ఎదురు చూసిన పసి మనసు ఆశలు ఆవిరయ్యాయి. కనికరం లేకుండా ఆ కిరాతకుడు క్రూరంగా కొరుకుతూ.. రక్కుతూ.. పీక తొక్కేస్తుంటే అశువులు అనంతవాయువుల్లో కలిసిపోయాయి. ఈ క్రమంలోనే అపురూపంగా పెంచుకున్న బిడ్డను నిర్జీవంగా చూసి తల్లిదండ్రుల నవనాడులు కుంగిపోయాయి. నిరుపేద గిరిజన బతుకుల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

- మూడున్నరేళ్ల చిన్నారిని చిదిమేసిన మానవమృగం
- చాక్లెట్ ఆశ చూపి తీసుకెళ్లి కిరాతకం
- నిందితుడిని కఠినంగా శిక్షించాలంటున్న జనం
- కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న కుటుంబీకులు
- బిడ్డ మృతదేహం చూసి సొమ్మసిల్లిపడిపోయిన తల్లిదండ్రులు

సాక్షి ప్రతినిధి, తిరుపతి : పాపం.. ఆ చిన్నారికి తెలియదు.. తనకు చాక్లెట్ ఇచ్చింది ఒక మృగం అని.. అది తనను కబళిస్తుందని. దగ్గరకు పిలిస్తే నవ్వుతూ వెళ్లింది. చాక్లెట్ ఇస్తే సంతోషపడింది. ఎత్తుకుంటే మురిసిపోయింది. పక్కకు తీసుకెళుతుంటే ఆడుకోవడానికేమో అని ఆనందపడింది. కానీ, ఆ మానవమృగం మనసులో వికృతాన్ని పసిగట్టలేకపోయింది. ఆ కామాంధుడి పశువాంఛకు బలైంది. తిరుపతి జిల్లా వడమాలపేట మండలం ఏఎం పురం గిరిజన కాలనీకి చెందిన మూడున్నరేళ్ల చిన్నారిపై సుశాంత్ అనే కిరాతకుడు శుక్రవారం సాయంత్రం లైంగిక దాడికి పాల్పడి.. ఆపై హత్య చేసి ఘటన ప్రతి ఒక్కరినీ కలచివేస్తోంది. వినడానికే ఇబ్బందిగా ఉన్న ఈ దారుణ ఘటనను ఊహిస్తేనే గగుర్పాటు కలుగుతుంది. అప్పటి దాకా తల్లితో నవ్వుతూ.. ఆడుకుంటున్న చిన్నారి మాయ మాటలు విని.. మద్యం మత్తులో ఉన్న దుర్మార్గుడి చేతిలో ప్రాణాలు కోల్పోయింది. పసిబిడ్డపై లైంగిక దాడికి పాల్పడిన, మురుగు కాలువలో తొక్కి చంపేశాడనే విషయం తెలుసుకుని ప్రతి ఒక్కరి మనసు ఆవేదనతో నిండిపోయింది. శనివారం ఉదయం పుత్తూరు ప్రభుత్వాస్పత్రి వద్ద చిన్నారి తల్లిదండ్రుల రోదనలు చూపరుల హృదయాలను కలిచివేశాయి. కిరాతకుడి చేష్టలకు ఆ చిన్నారి ఎంతగా తల్లడిల్లిపోయిందోనని కేవీబీ పురం ఓళ్లూరు గిరిజన కాలనీ వాసులు కన్నీటి పర్యంతం అయ్యారు.



పోస్టుమార్టం అనంతరం చిన్నారి మృతదేహాన్ని తీసుకొచ్చిన సిబ్బంది

నాలుగు రోజుల ముందే వచ్చాం

''దీపావళి పండుగ జరుపుకుందామని వస్తే మా ఇంటి దీపం ఆర్పేసాడు. నీకు దయలేదా దేవుడా'' అంటూ చిన్నారి తల్లి కన్నీరుమున్నీరైంది. ''మా ముద్దుల పట్టీని ఆ పశువు నాశనం చేసి చంపుతుంటే ఏం చేస్తున్నావు దేవుడా'' అంటూ విలపిస్తున్న ఆ తల్లిని ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు. ''అత్తగారింటికి నాలుగు రోజుల ముందే వచ్చాం. మాతో కలిసి తిరిగిన వాడే ఇలాంటి ఘోరం చేస్తాడని ఊహించలేదు. ముద్దు మాటలతో మురిపించే పసిబిడ్డను ఈ విధంగా బలి తీసుకునేందుకు వాడికి మనసెలా వచ్చిందో..? ఇది మనుషులు ఉండే లోకమేనా..?'' అంటూ చిన్నారి తండ్రి గుండెలవిసేలా రోదించాడు.



పండుగకు గిరిజన దంపతులు వచ్చిన ఇల్లు

దేవుడా ఏంటీ దారుణం

దీపావళి పండుగ రోజున ఇంతటి దారుణం ఏంటి దేవుడా అంటూ ఏఎంపురం వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారి తల్లిదండ్రులతో కలిసి గ్రామం మొత్తం పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలివచ్చింది. ఎవరిని ఎవరు ఓదార్చాలో తెలియని స్థితిలో.. ఒకరిని చూసి మరొకరు కన్నీటి పర్యంతమయ్యారు. చిన్నారి మృతదేహానికి త్వరగా పోస్టుమార్టం చేసి తమకు అప్పగించాలని అధికారులను వేడుకున్నారు. ఉదయం 11 గంటలకు కూడా పోస్టుమార్టం చేపట్టకపోవడంతో మండిపడ్డారు. అధికారులను నిలదీశారు. పరామర్శించేందుకు వచ్చిన మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామితో తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ క్రమంలోనే మాజీ మంత్రి ఆర్‌కే రోజా, టీటీడీ బోర్డు మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఆస్పత్రికి చేరుకుని బాధిత కుటుంబీకులను ఓదార్చారు. ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఘటన జరిగింది ఇలా..

- ఏఎంపురం ఎస్టీ కాలనీలో శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి చిన్నారి కనబడలేదు
- రాత్రి 7 గంటల వరకు తల్లిదండ్రులు పాప ఆచూకీ కోసం వెతికి పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- వడమాలపేట పోలీసులు రాత్రి 8 గంటలకు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.
- రాత్రి 9గంటలకు పాప తల్లిదండ్రుల అనుమానం మేరకు నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు.
- నిందితుడి నుంచి వివరాలు రాబట్టి, రాత్రి 11 గంటలకు స్కూల్ పక్కన ఉన్న మురుగు కాలువలో పాప మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
- శనివారం వేకువజామున చిన్నారి మృతదేహాన్ని పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.
- 10 గంటలకు పుత్తూరుకు వచ్చిన ఎస్పీ సుబ్బరాయుడు నిందితుడి అరెస్ట్ చూపించారు.
- మధ్యాహ్నం 1.30 గంటలకు చిన్నారి మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి చేసి తల్లిదండ్రులకు అప్పగించారు.
- స్వగ్రామం కేవీబీపురం మండలం ఓళూరుకు మృతదేహాన్ని తీసుకెళ్లారు.

ఓళూరులో విషాదఛాయలు

చిన్నారి మృతి విషయం తెలియగానే వారి స్వగ్రామం కేవీబీపురం మండలం ఓళూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. మానవత్వం లేకుండా పసిబిడ్డపై దారుణానికి ఒడిగట్టిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం గ్రామానికి తీసుకువచ్చిన చిన్నారి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించి కన్నీటి వీడ్కోలు పలికారు.



చిన్నారి తల్లిని ఓదారుస్తున్న మాజీ మంత్రి ఆర్‌కే రోజా



చిన్నారి తల్లిని ఓదారుస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి



చిన్నారి తల్లిదండ్రులకు భరోసా కల్పిస్తున్న టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి



చిన్నారి మృతదేహాన్ని చూసేందుకు ఆస్పత్రిలోకి వెళ్లకుండా మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామిని అడ్డుకుంటున్న పోలీసులు



పుత్తూరు ప్రభుత్వాస్పత్రి ఎదుట గుమికూడిన గ్రామస్తులు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు



చిన్నారిని పాశవికంగా హతమార్చిన స్థలం

సృజనకు జీవం.. శోధనకు ఊతం



ఒక ఆలోచన జీవితాన్నే మార్చేస్తుంది. అది ప్రయోగమైతే ప్రపంచాన్నే శాసిస్తుంది. ఇలాంటి ప్రయోగాలకు విజ్ఞానశాస్త్రం నెలవు. విశ్వం వేగంగా పుంజుకుని పాతధోరణులకు మంగళం పలికింది. ప్రయోగాలు చేసేవారు ఆకాశం నుంచి దిగిరావాలా? అవసరం లేదు. మనలోనే పుడుతున్నారు. మన బడిలో చదివినవారే నేడు ప్రపంచాన్ని ప్రయోగాలతో ముందుకు నడిపిస్తున్నారు. అలాంటి వారి సృజనకు జీవం పోసి, పరిశోధనకు ఊతం ఇవ్వడానికి పుట్టుకొచ్చిందే స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్. ఇది భావిశాస్త్రవేత్తలకు చక్కటి అవకాశం.. అందిపుచ్చుకోవడానికి దరఖాస్తుల ఆహ్వానం.. దీనిపై ప్రత్యేక కథనం.

- భావిశాస్త్రవేత్తలకు చక్కటి అవకాశం స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ కార్యక్రమం
- సద్వినియోగం చేసుకోవాలంటున్న విద్యాశాఖాధికారులు
- క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్న విద్యాశాఖ
- నవంబర్ 30లోపు దరఖాస్తు చేసుకోవాలి

చిత్తూరు కలెక్టరేట్ : ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో విద్యార్థులు చిన్న వయసులో ప్రాజెక్టుల రూపకల్పన చేసేలా కేంద్ర ప్రభుత్వం, విద్యాశాఖ 'స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్' అనే కార్యక్రమం చేపట్టింది. భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఇదో చక్కటి అవకాశం. 2024–25 సంవత్సరానికి ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. నీతి ఆయోగ్, ఏటీఏఎల్ ఇన్నోవేషన్ మిషన్, యూనిసెఫ్, కేంద్ర ప్రభుత్వం పరిధిలోని ఇన్నోవేషన్ విభాగం, ఏఐసీటీఈ సహకారంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. దీనిపై ఇప్పటికే జిల్లాల సైన్స్ అధికారులకు, ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు, సైన్సు ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఇది ఎంతో దోహదపడుతుందని విద్యాశాఖాధికారులు వెల్లడిస్తున్నారు. ఈ కార్యక్రమంపై విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు.

అవకాశం ఎవరికంటే..?

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో ఆరో తరగతి నుంచి ఇంటర్ చదువుతున్న వారందరికీ అవకాశం ఉంటుంది. చిత్తూరు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో 2,444 వరకు అన్ని యాజమాన్యాల పాఠశాలలున్నాయి. అలాగే జిల్లాలో 98 వరకు జూనియర్ కళాశాలలున్నాయి. జిల్లాలో 6 నుంచి పదో తరగతి వరకు 2.78 లక్షల మంది, ఇంటర్‌లో 42 వేలకు పైగా విద్యార్థులున్నారు. ఒక్కో పాఠశాల నుంచి బృందంగా విద్యార్థులు ప్రాజెక్టుల రూపకల్పన చేయాల్సి ఉంటుంది. ఇద్దరు లేక ముగ్గురు మాత్రమే ఒక బృందంలో ఉండాలి. schoollinnovation marathon.org అనే వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేయాలి. ఆ తర్వాత విద్యార్థులు, ఉపాధ్యాయునికి ఎంట్రీ కోర్సు నిర్వహిస్తారు. తర్వాత వారి ఆలోచనలు అందులో పొందుపర్చాల్సి ఉంటుంది. అయితే ప్రాజెక్టుల రూపకల్పన ఏవిధంగా ఉండాలంటే.. సమకాలీన సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపేలా ఉండాలి. ఇప్పటికే పరిష్కారం కనుగొని ఉంటే.. ఇంకా మెరుగైన పరిష్కారాలు సూచించాలి. ఎంపికైన విద్యార్థులకు కేంద్ర మంత్రిత్వ శాఖ నుంచి ప్రత్యేక బహుమతులు, ఉన్నత విద్యకు సహకారం అందిస్తారు.

జిల్లాలో పాఠశాలలు, కళాశాలల సమాచారం

పాఠశాలలు	కళాశాలల సంఖ్య	చదువుతున్న విద్యార్థుల సంఖ్య
ప్రాథమిక పాఠశాలలు	2,064	95,454
ప్రాథమికోన్నత	293	29,357
ఉన్నత	527	1,32,882
ఇంటర్మీడియట్	98	26,435
మొత్తం	2,982	2,84,128



స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ వెబ్‌సైట్ చిత్రం

జనవరిలో విజేతల ప్రకటన

జిల్లాలో అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు నవంబర్ 30వ తేదీ నాటికి ప్రాజెక్టుల రూపకల్పన చేసి, దరఖాస్తుల ప్రక్రియ పూర్తి చేయాలి. వాటిని పరిశీలించి 2025 జనవరిలో వెయ్యి మంది విజేతలను ప్రకటిస్తారు. వచ్చే ఏడాది మే నెలలో విజేతలకు బహుమతులు అందిస్తారు. జులై 29న దేశవ్యాప్తంగా నిర్వహించే అతిపెద్ద 'ఇన్నోవేషన్ షో'లో విద్యార్థులు పాల్గొనాల్సి ఉంటుంది. ఈ పోటీల్లో ప్రతి రాష్ట్రం నుంచి 20 బృందాలను విజేతలుగా ప్రకటిస్తారు. ఇంకా 20 బృందాలు ప్రభుత్వ పాఠశాలల నుంచి, 20 బృందాలు ఉమ్మడి జిల్లా నుంచి, ప్రత్యేక అవసరాల పిల్లలకు సంబంధించి 20 బృందాలను ఎంపిక చేయనున్నారు.

మంచి కార్యక్రమం..



స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ ఒక మంచి కార్యక్రమం. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొనేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. భావిశాస్త్రవేత్తలుగా విద్యార్థులు ఎదిగేందుకు ఇదొక చక్కటి అవకాశం. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. టీచర్లు విద్యార్థులకు సలహాలు, సూచనలు ఇవ్వాలి. – వరలక్ష్మి, డీఈఓ, చిత్తూరు

సైన్సు టీచర్లు చొరవ చూపాలి



జిల్లాలోని సైన్సు ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపి, మారథాన్ కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి. దీనిపై ఇప్పటికే క్షేత్రస్థాయిలో హెచ్‌ఎంలకు, సైన్సు టీచర్లకు తెలియజేశాం. జిల్లా నుంచి మంచి నాణ్యమైన ప్రాజెక్టులను తయారు చేసేలా టీచర్లు విద్యార్థులను ప్రోత్సహించాలి. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఇదొక మంచి కార్యక్రమం. – చంద్రశేఖర్, డీవైఈఓ, చిత్తూరు

భూమన ప్రమాణ స్వీకారం నేడే

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు
- తిరుపతిలో భారీ బహిరంగ సభ



భూమన కరుణాకరరెడ్డి



ప్రమాణస్వీకారోత్సవానికి ముమ్మరంగా సాగుతున్న ఏర్పాట్లు

తిరుపతి రూరల్ : చిత్తూరు, తిరుపతి జిల్లాకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా భూమన కరుణాకరరెడ్డి ఆదివారం ఉదయం 10 గంటలకు పదవీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ మేరకు తిరుపతి శివారులోని 150 అడుగుల జాతీయ రహదారికి సమీపంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు తరలిరానున్నారు. రాష్ట్రంలో పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత తొలిసారిగా నిర్వహిస్తున్నబహిరంగ సభ కావడంతో రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఏర్పాట్లు సిద్ధం చేశారు. తుడా మాజీ చైర్మన్ మోహిత్‌రెడ్డితో కలిసి శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సభా స్థలి వద్దే ఉంటూ ఏర్పాట్లను పర్యవేక్షించారు. బహిరంగ సభకు తరలివచ్చే పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రముఖులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా సర్వం సిద్ధం చేస్తున్నారు.

హాజరు కానున్న అతిరథ మహారథులు

భూమన కరుణాకరరెడ్డి ప్రమాణ స్వీకారమహోత్సవానికి వైఎస్సార్‌సీపీ నుంచి అతిరథ మహారథులు హాజరుకానున్నారు. అలాగే జిల్లా నలుమూలల నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పెద్దసంఖ్యలో తరలి రావాలని చెవిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 3,385 మంది పింఛన్లకు దూరం

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 3,385 మంది లబ్ధిదారులు పింఛన్లకు దూరమయ్యారు. శనివారం రాత్రి అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. నవంబర్ నెల పింఛన్ల పంపిణీలో చిత్తూరు జిల్లాలో 99.34 శాతం, తిరుపతి జిల్లాలో 99.39 శాతం నమోదైంది. చిత్తూరు జిల్లాలో 2,68,021 మందికి పింఛన్లు మంజూరు చేయగా ఇందులో 2,66,258 మందికి అందజేశారు. అలాగే తిరుపతి జిల్లాలో 2,65,488 మందికి పింఛన్లు మంజూరు చేయగా 2,63,866 మందికి పంపిణీ చేశారు. చిత్తూరు జిల్లాలో 1,763 మందికి, తిరుపతి జిల్లాలో 1,622 మందికి పింఛన్లు ఇవ్వలేకపోయారు. పింఛన్లు పొందేందుకు శనివారం రాత్రి 12 గంటల వరకు సమయం ఉంటుంది. ఆ తర్వాత ఆదివారం ఉదయం లబ్ధిదారులు పింఛన్‌లు పొందాలన్నా అవకాశం ఉండదని అధికారులు వెల్లడిస్తున్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



సూచనలు ఇస్తున్న సీఈఓ రవికుమార్‌నాయుడు

చిత్తూరు కార్పొరేషన్: కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు ఆదేశించారు. శనివారం సాయంత్రం ఆకస్మికంగా జెడ్పీ కార్యాలయంలోని అన్ని సెక్షన్లను పరిశీలించారు. ఫైల్స్ ఇలా టేబుళ్లపై చిందరవందరగా కాకుండ పద్ధతి ప్రకారం పెట్టుకోవాలన్నారు. అవసరమైనప్పుడు గుర్తుండేలా ఫైళ్లు తీసి ఇవ్వాలన్నారు. అందుకు అవసరమైన ర్యాక్స్ తెప్పించనున్నట్లు పేర్కొన్నారు. జెడ్పీ కార్యాలయానికి, సమావేశ మందిరానికి అధికారులు, ప్రజాప్రతినిధులు వస్తుంటారన్నారు. ప్రస్తుతం పాడుపడిన టాయిలెట్స్ బాగాలేవన్నారు. వాటిని మరమ్మతు చేయాలని? లేదా కొత్త టాయిలెట్స్ నిర్మాణానికి ప్లాన్ ఇవ్వాలని ఏఈని ఆదేశించారు.

క్లుప్తంగా

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

చిత్తూరు కార్పొరేషన్: చిన్నారిపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఏపీ మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి విజయ గౌరీ డిమాండ్ చేశారు. చిత్తూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తిరుపతి జిల్లా వడమాలపేట మండలంలో జరిగిన సంఘటన బాధకరమన్నారు. చిన్నారిపై లైంగికదాడికి పాల్పడడం దుర్మార్గమన్నారు. నిందితుడిని బహిరంగంగా ప్రజల మధ్య ఉరితీసేలా చట్టాలు తీసుకురావాలన్నా రు. చిన్నారి కుటుంబాన్ని అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

ఆగని ఏనుగుల దాడి

కల్లూరు(పులిచెర్ల): పంట పొలాలపై ఏనుగు దాడి ఆగడం లేదు. నెల రోజులుగా మండలంలో ఏదో ఒక ప్రాంతంలో పంటలను తొక్కి నాశనం చేస్తూనే ఉన్నాయి. శనివారం తెల్లవారు జా మున మండలంలోని గడ్డంవారిపల్లె పరిసర ప్రాంతాల్లో వరి, కూరగాయల పంటలను నాశనం చేశాయి.

రాళ్లవంకలో..

బంగారుపాళెం: మండలంలోని రాళ్లవంక గ్రామంలో శుక్రవారం రాత్రి వరి పంటపై ఏనుగులు దాడి చేసి, ధ్వంసం చేసినట్లు రైతులు తెలిపారు. గ్రామ సమీపంలోని అడవిలో నుంచి వచ్చిన ఒంటరి ఏనుగు మహిళా రైతు సూరమ్మ వరి పంటను తొక్కివేసిందని తెలిపారు. బాధిత రైతుల ఫిర్యాదు మేరకు అటవీ శాఖ అధికారుల శనివారం ఏనుగులు తొక్కివేసిన వరి పంటను పరిశీలించారు. బాధితులకు నష్టపరిహారం అందించేందుకు నివేదికలను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. ఏనుగులు పంటపొలాలపైకి రాకుండా ట్రాకర్స్ ద్వారా తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలించండి



మాట్లాడుతున్న జేసీ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ ని ర్మూలనకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ విద్యాధరి చెప్పారు. శనివారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో బాల కార్మిక వ్యవస్థ జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా బాల కార్మిక వ్య వస్థను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. బాల కార్మికులు ముఖ్యంగా ఇతర ప్రాంతాలకు వలస వెళుతుంటారన్నారు. జిల్లాలోని హోటళ్లు, ఆస్పత్రులు, మెకానిక్ షాపులు, ఇతర ప్రాంతాల్లో బాల కార్మికులుగా ఎక్కువగా ఉంటారని చెప్పారు. వారి తల్లిదండ్రులతో చర్చించి, బాల కార్మికులను పాఠశాలలకు పంపేలా చర్యలు చేపట్టాలన్నారు. స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలన్నారు. బాల్యవివాహాలు చేసుకున్న బాలికల్లో ఎక్కువగా బాలింత మృతులు జరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు వైద్య, ఐసీడీఎస్ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. వివాహ వయస్సు రాకముందు ముందస్తుగా వివాహాలు చేయడమే వచ్చే అనర్థాలను క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ప్రధానంగా కుప్పం, పలమనేరు ప్రాంతాల్లో ఎక్కువ దృష్టి పెట్టి బాల్య వివాహాలను అరికట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి, డీఎం అండ్‌హెచ్‌ఓ ప్రభావతి దేవి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి, జిల్లా కార్మిక శాఖ అధికారి ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం ఏది బాబూ?



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పాలసముద్రం : రైతులకు పెట్టుబడి సాయం ఏది బాబూ అని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి నిలదీశారు. శనివారం ఆయన పాలసముద్రంలో వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే 30 శాతం విద్యుత్ బిల్లులు తగ్గిస్తామని ప్రచారం చేసి, ఓట్లు దండుకున్న అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం పేద ప్రజలపై రూ.కోట్ల భారం మోపడం నీతిమాలిన చర్య అని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఒకవైపు పేదలకు మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామని చెబుతూ మరోవైపు సర్ చార్జీల పేరిట రూ.6,072 కోట్ల విద్యుత్ బిల్లుల భారాన్ని మోపిందన్నారు. అధికారంలోకి వచ్చి ఐదు నెలలు దాటుతున్నా రైతులకు పైసా సాయం చేయలేదన్నారు. చివరకు గత ప్రభుత్వం అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకాన్ని కూడా ఎత్తివేసిందన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు రైతులకు ఏటా రూ. 20 వేలు పెట్టుబడి సాయం చేస్తామని నమ్మించి, అధికారంలోకి వచ్చాక అమలు చేయడం లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో మహిళలు, బాలికలపై లైంగికదాడులు జరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఏదైనా మాట తప్పడం చంద్రబాబుకే సాధ్యమని, ఇప్పటికే పెరిగిన నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలతో ఒక పూట తిని ఒక పూట పస్తులుండే పరిస్థితి నెలకొందన్నారు. కూటమి ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే తమ పార్టీ తరపున రాష్ట్రవ్యాప్త ఆందోళన చేస్తామని హెచ్చరించారు. చంద్రబాబు మద్యం వ్యాపారంపై ఉన్న శ్రద్ధ ప్రజల సమస్యలపై లేదన్నారు. విచ్చలవిడిగా మద్యం షాపుల ఏర్పాటుకు లైసెన్స్‌లు ఇచ్చి, పేదల ఆరోగ్యంతో చెలగాటమాడుతుందని విమర్శించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తులసి యాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్, సుందరాజు, పుత్తూరు కేశవరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు లికితఅరుల్, సర్పంచ్ గాలి మహేష్ బాబు, అయ్యప్ప, అనురేఖ, నాయకులు షణ్ముగరెడ్డి, పయణి, కుట్టి, నరసింహారెడ్డి, రవిరెడ్డి, దనంజయ రెడ్డి, పద్మనాభనాయుడు, గోపాల్, శేఖర్, చినబ్బరాజు, లక్ష్మణన్, రాజామణి, సురేష్, గణేష్‌రెడ్డి మురుగేష, వేణు, జనార్ధన నాయుడు, చెల్లయ్య, వైస్ సర్పంచ్ ఎల్లమ్మ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు డీఎం పురం విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం కేశవులు, ఉపాధ్యాయులు

కార్వేటినగరం: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు డీఎం పురం విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం కేశవులు అన్నారు. శనివారం పాఠశాల ఆవరణలో రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికై న విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయుడు తిరుమలరాజు, హెచ్‌ఎం కేశవులు అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ బంగారుపాళెం మండలం రాగిమానుపెంట ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీల్లో అండర్– 14 విభాగంలో వినాయక, పావనిసాయి, సాయికిరణ్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని, అలాగే అండర్ –17 విభాగంలో శశిరాం, మౌళి, విజయ దుర్గ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. పీడీ తిరుమల రాజును హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉద్యోగ విరమణ చేసినా.. అండగా ఉంటాం

చిత్తూరు అర్బన్: దాదాపు 43 ఏళ్ల పాటు పనిచేసి, ఉద్యోగ విరమణ పొందినప్పటికీ.. పోలీసుశాఖ అండగా ఉంటుందనే విషయం గుర్తించుకోవాలని చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. బైరెడ్డిపల్లె స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేసిన అశోక్ కుమార్, ఏఆర్‌లో స్వీపర్‌గా పనిచేసిన వెంకటమ్మ గతనెలలో ఉద్యోగ విరమణ పొందారు. శనివారం చిత్తూరు నగరంలోని పోలీసు అతిథి గృహంలో వీరిద్దరికీ సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సుదీర్ఘకాలం పాటు పోలీసుశాఖలో పనిచేసి రిటైర్ అయినా, ఆ కుటుంబానికి ఎలాంటి అవసరం వచ్చినా తాము అండగా ఉంటామన్నారు. అనంతరం వారిని దుశ్శాలువతో సన్మానించారు.

మానవ మృగాన్ని శిక్షించండి



కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న ప్రజాసంఘాల నేతలు

పుత్తూరు: వడమాలపేట మండలం ఏఎం పురం ఎస్టీ కాలనీలో జరిగిన ఘోరం సభ్యసమాజం తలదించుకునేలా ఉందని, ఇందుకు కారకుడైన మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాలు పిలుపునిచ్చాయి. శనివారం పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. ఐద్వా కార్యదర్శి సాయిలక్ష్మి మాట్లాడుతూ మూడున్నరేళ్ల చిన్నారిపై లైంగిక దాడి చేసి, హతమార్చడం అత్యంత అరాచక చర్య అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు అక్బర్, రవి, వినోద్, నరేంద్ర, హర్షద్, గణేష్, సీఐటీయూ నాయకులు వెంకటేష్ పాల్గొన్నారు.

జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల పాదయాత్ర

కుప్పం రూరల్: గుడుపల్లి మండలానికి చెందిన నలుగురు యువకులు తమ అభిమాన నటుడు జూనియర్ ఎన్టీఆర్‌ను కలిసేందుకు హైదరాబాద్‌కు పా ద యాత్ర చేపట్టారు. సోడిగానిపల్లి పంచాయతీ పాళెం గ్రామానికి చెందిన జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు శివ, హరి, లక్ష్మీపతి, కదిరప్ప పాద యాత్రగా వెళ్లి తమ అభిమాన నటుడిని కలవాలని అనుకున్నారు. దీంతో వారు శనివారం స్వ గామం నుంచి హైదరబాద్‌లోని జూనియర్ ఎన్టీఆర్ నివాసం వరకూ 'వేసే ప్రతి అడుగు జూనియర్ ఎన్టీఆర్ అన్న కోసం' పేరుతో పాదయాత్ర ప్రారంభించారు. దాదాపు 650 కిలోమీటర్లు కాలినడక వెళ్లి ఎన్టీఆర్‌ని కలవనున్నారు. వారికి కుప్పం జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడు శివరాయల్ వారికి సంఘీభావం తెలిపారు.

తమ్ముళ్ల మందు వార్

శాంతిపురం: మద్యం వ్యాపారం కోసం టీడీపీ నాయకుల నడుమ ఆధిపత్య పోరులో ఇరువర్గాల మోహరించాయి. ఈ సంఘటన ఉద్రిక్తతకు దారితీసింది. మండల కేంద్రంలో రెండు మద్యం దుకాణాలను తెలుగు తమ్ముళ్లు పోటాపోటీగా ఒకే చోట ఏర్పాటు చేశారు. శుక్రవారం రాత్రి తమ మద్యం దుకాణం వద్ద మకాం వేసిన టీడీపీ నాయకుడు వెనుక ఉన్న మరోషాపునకు వెళుతున్న మందుబాబులను తమ షాపునకే రావాలని పిలవసాగాడు. దీనిని గమనించిన ఆ షాపు పార్టనర్ అయిన మరో నాయకుడు కలగజేసుకోవడంతో ఇరువురి మధ్య మాటలు పెరిగాయి. దీంతో ఇరువురు తమ గ్రామాలకు చెందిన వారికి ఫోన్లు చేసి, జనసమీకరణ చేశారు. అయితే టీడీపీకి చెందిన మరి కొందరు నాయకులు కలుగజేసుకుని ఇరువర్గాల నడుమ రాజీ కుదర్చడంతో వ్యవహారం సద్దుమనిగింది.

ఆలయంలో చోరీ

కుప్పంరూరల్: మండలంలోని అడవిములకలపల్లి రాళ్లగంగమ్మ దేవాలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగినట్లు గ్రామస్తులు చెప్పారు. గ్రామస్తుల కథనం మేరకు.. రాళ్లగంగమాంబ ఆలయంలో శుక్రవారం గుర్తు తెలియని దుండగులు ఆలయం గేటు పగులగొట్టి ఆలయంలోని అమ్మవారి బంగారు తాళి 2 గ్రాములు, రాగి రెండు కిలోలు, ఇత్తడి 4 కిలోలు, వెండి 20 గ్రాములు, రూ.7 వేల నగదు దోచుకెళ్లారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఐదుగురికి గాయాలు

పుంగనూరు: మండలంలోని చదళ్ల సమీపంలో రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఐదుగురు తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. చౌడేపల్లె మండలం ముదిరెడ్డిపల్లెకు చెందిన శ్రీనివాసులు (18), అదిలక్ష్మి(35), అఖిల(2), హర్షవర్ధన్(6) పుంగనూరుకు సొంత పనులపై వస్తుండగా మార్గం మధ్యలోని చదళ్ల వద్దకు రాగా పుదిపట్లకు చెందిన బాబురెడ్డి(55) ద్విచక్రవాహనం ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాడు. దీంతో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. కేసు దర్యాప్తు లో ఉంది.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు అరగొండ విద్యార్థినులు





ఏ.లాస్య, టి.ఉషారాణి

తవణంపల్లె: హాకీ రాష్ట్రస్థాయి అండర్–17 పోటీలకు తవణంపల్లె మండలం అరగొండ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికై నట్లు హైస్కూల్ హెచ్‌ఎం మోహన్‌రెడ్డి తెలిపారు. గత నెలలో మదనపల్లెలో జరిగిన అండర్–17 హాకీ పోటీల్లో విద్యార్థినిలు ఏ.లాస్య, టి.ఉషారాణి ఉత్తమ ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు.

యువకుడిపై దాడి

పుంగనూరు: పట్టణంలోని దోబీకాలనీకి చెందిన శివ అనే యువకుడిపై శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు బీరుబాటిళ్లతో దాడి చేశారు. సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. దోబీకాలనీకి చెందిన శివ అనే వ్యక్తి పెయింటర్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి స్థానికంగా కొంత మంది యువకులతో పాతకక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి శివను గుర్తుతెలియని వ్యక్తులు మేలుపట్ల వద్దకు తీసుకెళ్లి బీరుబాటిళ్లతో దాడి చేసి, గాయపరిచారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ శ్రీనివాసులు తెలిపారు.

దారి దోపిడీ దొంగల ముఠా అరెస్టు

ఐరాల: జాతీయరహదారిలో ఒంటరిగా వెళుతున్న వ్యక్తుల వద్ద నగదు, ఫోన్‌లు, ద్విచక్రవాహనాలను దోపిడీ చేస్తున్న దొంగల ముఠాను కాణిపాకం పోలీసులు అరెస్టు చేశారు. కాణిపాకం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను చిత్తూరు వెస్ట్ సీఐ శ్రీధర్‌నాయుడు, కాణిపాకం ఎస్ఐ ధరణీధర శనివారం వెల్లడించారు. తిమ్మాజిపల్లెకు చెందిన వెంకటముని గత నెల 29వ తేదీ రాత్రి బొమ్మసముద్రం ఫ్లైఓవర్‌పై బైక్‌లో వెళుతున్నాడు. ఈ క్రమంలో బైక్‌పై ఇద్దరు వ్యక్తులు వచ్చి ఆయన్ని అడ్డగించి దాడి చేసి బైక్‌తోపాటు రూ.16 వేలు నగదు, ఒక మొబైల్ ఫోన్ దోపిడీ చేసినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం ఎం.పైపల్లె హైస్కూల్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించిన చిత్తూరు నగరం జానకారపల్లెకు చెందిన సింగమలై(23), రజని(49)ను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2.38 లక్షల విలువ చేసే ఒక మొబైల్ ఫోన్, నాలుగు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు. ఈ కేసులో ప్రతిభ చూపిన సీఐ శ్రీధర్‌నాయుడు, ఎస్ఐ ధరణీధర, సిబ్బంది సుజాత, సురేంద్రబాబు, భాస్కర్, శివలను జిల్లా డీఎస్పీ సాయినాథ్ అభినందించారు.

వృద్ధురాలి మెడలోని చైన్ అపహరణ



బైక్‌లో వెళుతున్న చైన్‌స్నాచర్లు



సీసీ పుటేజీలను పరిశీలిస్తున్న సీఐ రాంభూపాల్

చౌడేపల్లె: దుకాణంలో వస్తువుల కొనుగోలు కోసం వచ్చిన ఇద్దరు యువకులు చాకచక్యంగా వ్యవహరించి, వృద్ధురాలి మెడలోని సుమారు రూ.2.50 లక్షల విలువ చేసే బంగారు చైన్‌తో ఉడాయించిన ఘటన శనివారం జరిగింది. బాధితురాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. చౌడేపల్లె పట్టణం గడ్డంవారిపల్లె రోడ్డు బైపాని పంక్షన్ హాల్ సమీపంలోని శంకర్‌రావుకు చెందిన దుకాణం వద్దకు ఇద్దరు యువకులు వచ్చారు. అక్కడే ఉన్న కె. రాజమ్మ (65) మెడలోని సుమారు 35 గ్రాముల బంగారు చైన్‌ను లాక్కొని పరారయ్యారు. వృద్ధురాలు కేకలు పెట్టడంతో అక్కడ ఉన్న యువకులు, కుటుంబ సభ్యులు వాహనాల్లో వెంబడించినా ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న సీఐ రాంభూపాల్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. సీసీ కెమెరాల రికార్డులు కూడా పరిశీలించారు.

రూటా జిల్లా అధ్యక్షుడిగా మునీర్ అహ్మద్



రూటా జిల్లా అధ్యక్షుడు మునీర్ అహ్మద్

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూటా) జిల్లా అధ్యక్షుడిగా మునీర్ అహ్మద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల రూటా జిల్లా అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలకు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఖలందర్ బాషా, సహ అధ్యక్షుడు హసానుల్లా పరిశీలకులుగా వ్యవహరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా మహ్మదుల్లా, కోశాధికారిగా ఇలియాస్ ఎన్నికయ్యారు. వర్కింగ్ అధ్యక్షుడిగా రబ్బానీ, గౌరవాధ్యక్షుడిగా మహమ్మద్ అలీ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికై న జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ జిల్లాలో ఉర్దూ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. అసోసియేషన్ అభివృద్ధికి, ఉర్దూ టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

అదృశ్యం.. నెలకు కాలువలో శవం



రమణ(ఫైల్)

వి.కోట: కుటుంబకలహాల కారణంగా ఇంటి నుంచి అదృశ్యమైన వ్యక్తి నెలరోజుల తర్వాత మురుగు కాలువలో శవమై తేలిన సంఘటన వి.కోటలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని ఈశ్వర్‌నగర్‌కు చెందిన రమణ(60) స్థానిక కేజీఎఫ్ బస్టాండ్‌లో పూల దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగించేవాడు. తాగుడుకు బానిసైన రమణ కుటుంబ కలహాల కారణంగా నెల రోజుల ముందు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆ రోజు నుంచి కుటుంబ సభ్యులు ఎంత వెతికినా కనిపించకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో రమణ కనిపించలేదని ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం పట్టణంలోని ఆగా కళ్యాణ మండపం వెనుక ఉన్న మురుగునీటి కాలువలో కుళ్లిపోయి గుర్తుపట్టడానికి వీలులేని స్థితిలో గుర్తుతెలియని వ్యక్తి శవం ఉండగా స్థానికులు గుర్తించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, ఆరా తీశారు. తప్పిపోయిన రమణ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని పరిశీలించగా చేయిపై ఉన్న పచ్చబొట్టు, చేతికి కట్టిన ధారం, ఆ వ్యక్తి ధరించిన ప్యాంటు చూసి రమణగా గుర్తించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



గుంతలు పూడ్చే కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్టు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఇండస్ట్రీయల్ ఎస్టేట్ వద్ద గుంతలను పూడ్చే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు చర్యలు చేపడుతోందన్నారు. జిల్లాలోని రహదారులను గుంతల రహిత రహదారులుగా చేసే కార్యక్రమం ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లాలో ఆర్‌అండ్‌బీ పరిధిలో రోడ్ల మరమ్మతులకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ఈ కార్యక్రమం ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, మాజీ మేయర్ కటారి హేమలత, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీనివాసులు, డీఈ నాగమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



